క్లుప్తంగా

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం



టీచర్ అమరేంద్ర తల్లికి నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

పామిడి: ఓ ఉపాధ్యాయుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో తోటి ఉపాధ్యాయులు స్పందించారు. వారంతా చందాలు వేసుకొని డబ్బు సాయం చేశారు. స్థానిక ఎంపీపీ ఉర్దూ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఉప్పర అమరేంద్ర ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఉపాధ్యాయుడి కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో చందాలు వేసుకొని రూ.75 వేలు పోగు చేశారు. ఆడబ్బును ఆదివారం పామిడిలోని ఉపాధ్యాయుడు అమరేంద్ర ఇంటికి వెళ్లి అతడి తల్లి ఉప్పర వెంకటలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలప్ప, కార్యదర్శి మల్లికార్జున, పామిడి మండల సీపీఎస్ అధ్యక్షుడు సీ గంగాధర, సభ్యులు సిమ్మన్న, ప్రభాకర్, రామన్న, రంగేషు, చంద్ర, రాజేష్, రామాంజనేయులు, క్రిష్టయ్య, విజయ్, లక్ష్మినారాయణ, బాల, చాంద్, మల్లికార్జున, వివేకానంద తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓలు, టీచర్లు

శింగనమల: మండలంలో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఆదివారం అనంతపురంలోని కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా సన్మానించారు. మండలంలో 51 మంది ఉపాధ్యాయులు వివిధ మండలాలకు బదిలీ కాగా, ఇతర మండలాల నుంచి 45 మందికి దాకా బదిలీపై వచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, ఉపాధ్యాయులు ఆనంద్, సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, రాధాకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి: తిప్పారెడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. నిందితుల నుంచి రూ.3,400 నగదుతోపాటు పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు



దివ్యాంగులకు భోజనం వడ్డిస్తున్న పైలా నరసింహయ్య

తాడిపత్రి: స్త్రీ శిశు, సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ జన్మదిన వేడుకలను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక జీవనాలయంలో ఆయన మానసిక దివ్యాంగుల సమక్షంలో కేక్ కట్ చేసి వారికి తినిపించారు. మంత్రికి ఆయురారోగ్యాలతో పాటు మంత్రిగా ప్రజలకు తన వంతు సేవలను అందిస్తూ, ఆమె మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటూ జీవనాలయ సిస్టర్లతో కలసి ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మానసిక దివ్యాంగులకు స్వయంగా భోజనాన్ని వడ్డించారు.

ప్రమాద సూచికల ఏర్పాటు



వేములపాడు వద్ద బోర్డును ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి

యాడికి: మండలంలోని గుత్తి, తాడిపత్రి రహదారిపై వేములపాడు, రాయలచెరువు మోడల్ స్కూల్ సమీపంలో చౌరస్తా, మలుపుల వద్ద ఆదివారం పోలీసులు ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని పలు మలుపులు, కూడళ్ల వద్ద తరచూ రోడ్డు ప్రమాదలు జరుగుతుండటంతో ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. వాహనదారులు ఆయా ప్రాంతాల్లో నిదానంగా వెళ్లాలని సూచించారు.

వలంటీర్లకు వందనం

రెడ్ జోన్‌లో నిర్భయంగా సేవలు..



రెడ్‌జోన్‌లో వృద్ధురాలికి నిత్యావసరాలు అందిస్తున్న వలంటీర్ ఆసీఫ్(ఫైల్)

గుంతకల్లుటౌన్: కరోనా సయయంలో వార్డు వలంటీర్లు అందించిన సేవలు అమూల్యమైనవి. కరోనా వైరస్ వ్యాపిస్తున్న సమయంలో రెడ్, ఆరెంజ్ జోన్లల్లో విధులు నిర్వర్తించడం కత్తి మీద సాములా మారింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలందించి కరోనా యోధుల్లా ప్రజల మన్ననలను పొందారు. పట్టణంలో రెండో కరోనా పాజిటివ్ కేసు బీటీ.పక్కీరప్ప కాలనీలో లక్ష్మీదేవి అనే వృద్ధురాలికి వచ్చింది. ఆమెను వలంటీర్లు, వైద్యసిబ్బంది చికిత్స నిమిత్తం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. కాలనీలో దాదాపు 125 ఇళ్లు రెడ్‌జోన్‌లో ఉన్నాయి. ప్రజలెవ్వరినీ రెడ్‌జోన్ దాటనివ్వలేదు. ఆ కాలనీలో వార్డు వలంటీర్లు మహమ్మద్ ఆసీఫ్, దివాన్, రాము, ఉదయ్, గోపాల్, షేకన్‌బీ ప్రజలకు విశిష్ఠ సేవలందించారు. 20 రోజుల పాటు కాలనీలో రోజూ ఇంటింటికీ నిత్యావసర సరుకులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు. ప్రజలకు ఏ చిన్న సమస్య అయినా వెంటనే స్పందించి ఆ సమస్యలన్నీ తీర్చారు.

ప్రజలకు నిరంతర సేవలు



కోవిడ్ సమయంలో కాయగూరలు పంపిణీ చేస్తున్న వలంటీర్ పుల్లారెడ్డి (ఫైల్)

పెద్దవడుగూరు: దేశం విపత్కర పరిస్థితుల్లో ఉన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు ఎంతో అండగా నిలిచింది. వలంటీర్లు ప్రాణాలకు తెగించి మరీ సేవలు అందించారు. లక్ష్మపల్లికి చెందిన వలంటీర్ పుల్లారెడ్డి తన తోటి వలంటీర్లతో కలిసి కోవిడ్ సమయంలో గ్రామాల్లోని ఇళ్ల మధ్య తిరుగూ నిత్యావసర సరుకులు అందించడంతోపాటు కోవిడ్ బాధితులకు ధైర్యం చెప్పాడు. అలాగో కోవిడ్‌తో హోం క్వారంటైన్‌లో ఉన్నవారికి మందులు, పౌష్టికాహారం, నిత్యావసరాలు అందజేసి నిత్యం అందుబాటులో ఉంటూ అండగా నిలిచాడు. తన పరిధిలో ఉన్న ఇళ్లను శానిటైజ్ చేయించి కరోనా రాకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఫీవర్‌లో సర్వే చేయించి అధికారులకు సకాలంలో సరైన సమాచారం అందేలా చేశాడు. పుల్లారెడ్డి సేవలను గుర్తించిన అధికారులు సేవా రత్నా అవార్డుతో సత్కరించారు.

వలంటీర్లు ఆత్మబంధువుల్లా పనిచేశారు



కరోనా ఫస్ట్ వేవ్ గుంతకల్లులో రెండో పాజిటివ్ కేస్ మా వార్డులో ఓ అవ్వకు వచ్చింది. రెండు ఏరియాలను రెడ్‌జోన్‌గా ఏర్పాటు చేశారు. మా ఇంట్లో సరుకులు, ఎమర్జెన్సీగా కొన్ని మందులు, చిన్నపిల్లలకు అవసరమైన తినుబండారాలను తెచ్చివ్వమని మా బంధువులకు ఫోన్ చేసి అడిగినా వామ్మో రెడ్‌జోన్‌లోకి మేము రామని తెగేసి చెప్పారు. కానీ సీఎం జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్ల మాత్రం ఆత్మబంధువుల్లా పనిచేశారు. మహమ్మద్ ఆసీఫ్, దివాన్,రాము, ఉదయ్, షేకన్‌బీ, గోపాల్‌లు అందించిన సేవలు జీవితంలో మరిచిపోలేం. వలంటీర్ల సేవల గురించి ఎంత చెప్పినా తక్కువే.

–షేక్ మెహతాజ్, బీటీ.పక్కీరప్ప కాలనీ, గుంతకల్లు.

ధైర్యం నింపాడు



గూడూరు ఓబుళరెడ్డి, లక్ష్మంపల్లి

కరోనా సమయంలో నేను, నాభార్య నాగేశ్వరమ్మ మాత్రమే ఇంట్లో ఉండేవాళ్లం. ఇంటికి సమీపంలో కరోనా వచ్చినవారు ఉండేవారు. ఆ సమయంలో కూడా వలంటీర్ పుల్లారెడ్డి, సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకు బాగోగులు చూసుకునేవారు. బంధువులు మా ఇంటి వద్దకు రావాలన్నా భయపడేవారు. వలంటీర్ తమకు ధైర్యం నింపడంతోపాటు నిత్యావసర వస్తువులు, శానిటైజర్లు అందజేసేవాడు. కరోనా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసేవాడు. వలంటర్ లేకుంటే మేము ఇబ్బందులు పడేవాళ్లం. వలంటీర్ సేవలను ఎన్నటికీ మరువలేం.

మనసున్న ముఖ్యమంత్రి జగనన్న



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దూదేకుల, నూర్‌బాషా సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని దూదేకుల, నూర్‌బాషా సంఘం నాయకులు కొనియాడారు. షాదీ తోఫా విషయంలో దూదేకుల, నూర్‌బాషా కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని మహానేత వైఎస్సార్ విగ్రహం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆ సంఘం అధ్యక్షుడు నబీరసూల్ మాట్లాడుతూ గతంలో దూదేకుల, నూర్బాషా కులాలకు షాదీ తోఫా కాకుండా కల్యాణమస్తు పథకం కింద రూ.50 వేలు మాత్రమే పారితోషికం అందించేవారన్నారు. ఈ విషయాన్ని దూదేకుల, నూర్‌బాషా సంఘం రాష్ట్ర ప్రతినిధులు ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్ వెంటనే షాదీ తోఫా కింద పారితోషికాన్ని రూ.50 వేల నుంచి రూ.లక్షకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అడిగిన వెంటనే ఉత్తర్వులు జారీ చేయడం ముఖ్యమంత్రి గొప్పతనానికి నిదర్శమని, ఆయనకు సర్వదా కృతజ్ఞులై ఉంటామన్నారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం కార్యదర్శి హుసేన్‌పీరా, సభ్యులు దస్తగిరి, నబీసాబ్, పెద్దహాజీ, వక్ఫ్‌బోర్డు కోశాధికారి బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రియా యోగాతో అత్యుత్తమ స్థితి

అనంతపురం కల్చరల్: మనిషి అత్యుత్తమ స్థితికి క్రియా యోగా దీక్ష ఎంతో దోహదపడుతుందని వైఎస్ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద పేర్కొన్నారు. అనంతలో యోగదా రాష్ట్ర స్థాయి సాధనా సంఘ సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. యోగదా సొసైటీ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద, రాంచీ నగరం నుంచి విచ్చేసిన స్వామి ప్రజ్ఞానానంద, స్వామి కేదారానంద సమావేశాల్లో కీలక ఘట్టమైన క్రియా యోగా దీక్షను సాధకులకు ప్రసాదించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి చెడు ఆలోచనలు రాకుండా క్రియా యోగం మనిషికి కవచంలా కాపాడుతుందన్నారు. అనంతలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించిన జిల్లా యోగా ప్రతినిధులు చంద్రశేఖర్, కేశవరెడ్డి, నరసింహులు, సురేష్, రామకృష్ణ తదితరులను వారు అభినందించారు. అంతకు ముందు వివిధ రాష్ట్రాల నుంచి గురువుల ఆశీర్వాదానికి వచ్చిన 300 సాధకులకు పుస్తక ప్రసాదాలు అందించారు.

షికారీల జీవన స్థితిగతులు మెరుగుపరచండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ సుధాకర్

గుంతకల్లుటౌన్: సంక్షేమ పథకాలు అందించి షికారీల జీవన స్థితిగతులను మెరుగుపరచాలని ఏపీ సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు, మున్సిపల్ కౌన్సిలర్ వై.సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం షికారీ కాలనీలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షికారీల పిల్లలకు నిర్బంధపు రెసిడెన్షియల్ విద్యనందించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్నారు. షికారీలకు కుల ధ్రువీకరణపత్రాలను అందజేయడంతో పాటు సొంతిళ్లను నిర్మించివ్వాలని కోరారు. కాలనీలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం షికారీల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సంచారజాతుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, నాయకులు విజయ్, ఇందిరాదేవి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీనియర్ నేతకు పరామర్శ



రాధమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

గార్లదిన్నె: కల్లూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి సతీమణి రాధమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, ఆదివారం కల్లూరుకు వెళ్లి అమరేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డిని పరామర్శించారు. రాధమ్మ మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొని రాధమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులార్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, నాయకులు అశోక్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'అవి మతిలేని రాతలు'



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుత్తి: అంగన్‌వాడీ పోస్టు విషయంలో తాము ఎమ్మెల్యేను నిలదీశామంటూ పచ్చపత్రికల్లో అసత్యకథనం రాశారని టి. కొత్తపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆదివారం టి. కొత్తపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు తిప్పన్న, జలాల్ గ్రామస్తులు, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం టి. కొత్తపల్లి గ్రామంలో గడప గడప కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి గ్రామానికి వచ్చారన్నారు. ఆ సమయంలో తాము ఎమ్మెల్యేను అంగన్‌వాడీ పోస్టు రూ.5 లక్షలకు అమ్ముకున్నారని, ఫీల్డ్ అసిస్టెంట్, స్టోర్ డీలర్ పోస్టును కూడా ఇతరులకు ఇచ్చారని తాము నిలదీసినట్లు అసత్య కథనాలు రాయడం శోచనీయమన్నారు. అసత్య వార్తలు రాసిన ఈనాడు, ఆంధ్రజ్యోతి విలేకరులపై పరువు నష్టం దావా వేస్తామన్నారు. ఎమ్మెల్యే వైవీఆర్ తమ గ్రామంలోకి వచ్చి గడప గడపకు తిరుగుతూ తమ సమస్యలను, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారన్నారు. ఈ క్రమంలో తాము గ్రామానికి సంబంధించిన , తమకు సంబంధించిన కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అంతే తప్ప ఈనాడు, ఆంధ్రజ్యోతి దిన పత్రికల్లో రాసినట్లు తాము ఎమ్మెల్యేను ఏమీ అనలేదన్నారు. తాము కష్టాల్లో ఉన్న సమయంలో ఎమ్మెల్యే వైవీఆర్ స్వయంగా తమ గ్రామానికి వచ్చి తమను ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిని తాము ఎందుకు నిలదీస్తామన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నామన్నారు. ప్రాణం ఉన్నంత వరకు పార్టీలోనే ఉంటామని, వైవీఆర్ వెంటే నడుస్తామన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లయ్యయాదవ్, తురకపల్లి మాజీ సర్పంచు ఎంసీ నాగరాజు, సీనియర్ నాయకులు రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ప్రయాణికులు మాధవి, మునిస్వామి, కండక్టర్ నాగరాజు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు..గుత్తి నుంచి అనంతపురానికి ప్రయాణికులతో బస్సు బయలు దేరింది. అయితే గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ మలుపు వద్ద బస్సును ఎదురుగా లారీ ఢీకొనింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ కండక్టర్ నాగరాజు(కర్నూలు), ప్రయాణికులు మాధవి(బెంగళూరు), మునిస్వామి(కర్నూలు జిల్లా తుగ్గలి) తీవ్రంగా గాయపడ్డారు. 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు మాధవిని అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మాతృశ్రీ హాస్పిటల్లో అరుదైన శస్త్ర చికిత్స



రోగి మోకాలికి ఏసీఎల్ లిగ్మెంట్ శస్త్ర చికిత్స చేసిన దృశ్యం

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న మాతృశ్రీ హాస్పిటల్లో రెండు రోజుల క్రితం అరుదైన ఆర్థోస్కోపిక్ శస్త్ర చికిత్స చేశారు. వివరాల్లోకి వెళితే.. తెలంగాణ రాష్ట్రం ఐజా మండలం ఉత్తనూర్ గ్రామానికి చెందిన సుమన్(20) మోకాళ్ల, కీళ్ల నొప్పులతో ఆస్పత్రికి వచ్చాడు. మాతృశ్రీ హాస్పిటల్ డాక్టర్లు రవితేజరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి అతడికి వైద్య పరీక్షలు నిర్వహించి ఏఎల్‌సీ లిగ్మెంట్ సమస్యతో మోకాళ్లు, కీళ్ల నొప్పులు వచ్చినట్లు గుర్తించాడు. ఆర్థోస్కోపిక్ శస్త్ర చికత్సను విజయవంతంగా పూర్తి చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా చేయని అరుదైన ఆర్థోస్కోపిక్ శస్త్ర చికిత్సను తమ ఆస్పత్రిలో చేశామని రవితేజరెడ్డి, ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఇక నుంచి ఎలాంటి శస్త్ర చికిత్సనైనా మా హాస్పిటల్లో చేస్తామని పేర్కొన్నారు.

రసాయన మందుల వాడకంలో జాగ్రత్తలు అవసరం



మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి

బుక్కరాయసముద్రం: రైతులు పొలాల్లో రసాయన మందులు వాడకంపై తప్పనిసరిగా జాగ్రత్తలుపాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు రసాయన మందుల వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా కేవీకేలో 95వ భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి మాట్లాడుతూ రైతులు చీడ పీడల నివారణలో పాటించాల్సిన మెలకులను వివరించారు. రసాయన మందులు పిచికారీలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. అనంతరం దత్తత గ్రామాల రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుధారాణి, సస్యఉత్పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శశికళ, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ రెడ్డి, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ చందన, రాఘవంపల్లి, చాపట్ల, చామలూరు గ్రామాల రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం అందించండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

బుక్కరాయసముద్రం: గ్రామాల్లో అనుమానితులు సంచరిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గుజ్జల సరళాదేవి నగర్‌లో ఆదివారం సైబర్ నేరాలు, మహిళల చట్టాలపై అవగాహన స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మహిళలు, బాలికలు సెల్‌ఫోన్లు వాడే సమయంలో అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిచయం లేని వ్యక్తికి సమాచారం ఇవ్వడం ప్రమాదకరమన్నారు. సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, మహిళా చట్టాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కాలనీల్లో చట్ట వ్యతిరేక కార్యాక్రమాలపై ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

శింగనమల: శింగనమల మార్కెట్‌యార్డ్ నూతన చైర్‌పర్సన్‌గా భూమిరెడ్డి సునీతను ప్రభుత్వం ఇటీవల నియమించిన విషయం తెలసిందే. ఈనేపథ్యంలో ఆమె ఆదివారం అనంతపురంలోని ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట పుట్లూరు ఎంపీపీ భూమిరెడ్డి రాఘవరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ శ్రీరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగర్జునరెడ్డి ఉన్నారు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రౌడీషీటర్లు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ గంగయ్య

తాడిపత్రి: మండలంలో ఎవరైనాశాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీఎం గంగయ్య హెచ్చరించారు. ఆదివారం రూరల్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా ఉన్న 60 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు అల్లర్లు మాని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనవసరంగా గొడవలకు దిగి ప్రజాజీవనానికి ఆటంకం కలిగించరాదన్నారు. గ్రామాల్లో కక్షలకు ఆజ్యం పోస్తే సహించమన్నారు. కార్యక్రమంలో సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఐ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

బసినేపల్లి వాసికి బంగారు నంది అవార్డు

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి గ్రామ వాసి ఎస్.మహబూబ్ బాషాకు బంగారు నంది అవార్డు దక్కింది. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో 2023కుగాను బంగారు నంది అవార్డుల ప్రదానం చేశారు. ఇందులో భాగంగా చెక్కభజనలో ప్రతిభ చాటిన గుత్తి మండలం బసినేపల్లికి చెందిన ఎస్.మహబూబ్ బాషాకు నిర్వాహకులు బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతను పలువురు ప్రముఖులు, తోటి కళాకారులు, స్నేహితులు అభినందించారు. మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి ప్రత్యేక పూజలు చేశారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని ముస్కాన్

తాడిపత్రి అర్బన్: జిల్లా కేంద్రంలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ అండర్ 11 పోటీల్లో తాడిపత్రి చెందిన ముస్కాన్ అనే విద్యార్థి అత్యంత ప్రతిభ కనపరిచింది. అనంతపురం ఉమ్మడి జిల్లాకు చెందిన బాలికలకు అనంతపురంలో మూడు రోజులుగా పోటీలు నిర్వహించారు. ఇందులో తాడిపత్రి నుండి 10 మంది విద్యార్థినులు పాల్గొనగా పట్టణంలోని శ్రీవాణి స్కూల్ విద్యార్థిని ముస్కాన్ ప్రథమస్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ రవి తెలిపారు. అండర్ 13లో రెండో స్థానంలో నిలిచిందన్నారు. ఈమె తూర్పు గోదావరిలో సెప్టెంబర్ 14 నుంచి 17 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుందన్నారు. ముస్కాన్‌ను బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు షఫీవుల్లా అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుత్తి రూరల్: రజాపురం శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. యాడికి మండలం తూట్రాలపల్లి కొత్తపల్లికి చెందిన వేలూరు అదెప్పనాయుడు(52) శనివారం రాత్రి కసాపురం నెట్టికంటుడి దర్శనానంతరం బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. రజాపురం శివారులో రహదారిపై ఉన్న మట్టి కుప్పను గమనించకుండా వేగంగా వచ్చి ఢీ కొన్నాడు. తీవ్రంగా గాయపడిన అదెప్పను 108 అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెద్దవడుగూరు: క్రిష్టిపాడు గ్రామంలో శ్రీకాంత్ అనే వ్యక్తి రంగనాయకులు అనే వ్యక్తిపై కత్తితో దాడి చేశాడు. వివరాలిలా ఉన్నాయి.. పక్కపక్క ఇళ్లలో ఉండే రామన్న, హరి అనే వ్యక్తులకు పాతకక్షలున్నాయి. ఆదివారం రాత్రి ఇంటి ముందు గురుసు తోలే విషయంలో రామన్న, హరి వాగ్వాదానికి దిగారు. ఈక్రమంలో సర్దిచెప్పేందుకు వెళ్లిన రంగనాయకులుపై రామన్న అల్లుడు శ్రీకాంత్ కత్తితో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన రంగనాయకులును కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు.